నేత్రపర్వంగా విజయదశమి వేడుకలు

ముస్తాబాద్: ఆలయం వద్ద మాట్లాడుతున్న ఎంపీపీ శరత్‌రావు, సిరిసిల్ల రూరల్: తంగళ్లపల్లిలో దసరా వేడుకల్లో సీఐ సదన్‌కుమార్, ఎస్ఐ వెంకటేశ్వర్లు, ఫ్రెండ్స్ క్లబ్ సభ్యులు, నేతలు

సిరిసిల్ల టౌన్, అక్టోబర్ 24: విజయదశమి వేడుకలు మంగళవారం జిల్లా వ్యాప్తంగా ఘనంగా జరిగాయి. భక్తులు ఆలయాలను దర్శించుకుని ప్రత్యేక పూజలు చేశారు. వాహన, షమీ పూజలు నిర్వహించారు. దుర్గామాత మండపాల్లో అమ్మవారికి అర్చనలు చేశారు. జిల్లా కేంద్రంలోని మానేరుతీరంలో హిందూ ఉత్సవ సమితి ఆధ్వర్యంలో అశ్వవాహనంపై శ్రీ లక్ష్మీవేంకటేశ్వరస్వామి ఊరేగింపు అనంతరం రావణ దహనం చేశారు. ఇక్కడ ఎస్పీ అఖిల్‌మహాజన్, డీఎస్పీ ఆర్ ఎస్ఎస్ విభాగ్ భాను, హిందూ ఉత్సవ సమితి సభ్యులు, ప్రజాప్రతినిధులు, ప్రజలు పాల్గొన్నారు. .

ఎల్లారెడ్డిపేటలో..

ఎల్లారెడ్డిపేట, అక్టోబర్ 24: మండల కేంద్రంతో పాటు పలు గ్రామాల్లో విజయదశమి వేడుకలను ఘనంగా జరిగాయి. సోమవారం మండల కేంద్రంలో సర్పంచ్ నేవూరి వెంకట్‌రెడ్డి ప్రత్యేక వేదికను ఏర్పాటు చేసి దసరా వేడుకలను అంగరంగ వైభవంగా నిర్వహించారు. పలు గ్రామాల్లో రావణదహన కార్యక్రమాన్ని జరిపారు. ఇక్కడ బీఆర్ఎస్ జిల్లా అధ్యక్షుడు తోట ఆగయ్య, ఎంపీపీ పిల్లి రేణుక, జడ్పీటీసీ చీటి లక్ష్మణ్‌రావు, ఏఎంసీ చైర్మన్ ఎలుసాని మోహన్, సెస్ డైరెక్టర్ వర్స కృష్ణహరి, పీఏసీఎస్ చైర్మన్ గుండారపు కృష్ణారెడ్డి, సర్పంచ్‌ల ఫోరం మండలాధ్యక్షుడు కొండాపురం బాల్‌రెడ్డి, ఎంపీటీసీల ఫోరం మండలాధ్యక్షుడు మామిండ్ల తిరుపతి బాబు, సర్పంచ్‌లు, ఎంపీటీసీలు, గ్రామ ప్రజలు పాల్గొన్నారు.

ముస్తాబాద్‌లో..

ముస్తాబాద్, అక్టోబర్ 24: విజయదశమి వేడుకలు మండలంలోని అన్ని గ్రామాల్లో సోమవారం ఘనంగా నిర్వహించారు. దసరా పండుగను పురస్కరించుకుని ఉదయం నుండే ఆలయాల్లో వేదపండితుల మంత్రోచ్చరణలతో ప్రత్యేక పూజలు నిర్వహించారు. పాలపిట్ట, గరత్మంతుని చూసి సాయంత్రం గ్రామ పంచాయతీలు, గ్రామ చావడి, ఆలయాల వద్ద ఆచారం ప్రకారం గొర్రెపిల్లలను బలి ఇవ్వడం, ఆలయాల వద్ద గ్రామం బాగుండాలని జమ్మి చెట్టుకు ప్రత్యేక పూజలు నిర్వహించారు. వేడుకల్లో ఎంపీపీ జనగామ శరత్‌రావు, జడ్పీటీసీ గుండం నర్సయ్య, సెస్ డైరెక్టర్ సందుపట్ల అంజిరెడ్డి, రైతు బంధు అధ్యక్షుడు కల్వకుంట్ల గోపాల్‌రావు, సర్పంచుల ఫోరం అధ్యక్షుడు కలకొండ కిషన్‌రావు, ఏఎంసీ చైర్మన్ అక్కరాజు శ్రీనివాస్, డాక్టర్ చంద్రశేఖర్ రావు, పూర్ణచందర్‌రావు, శ్రీనివాస్‌రావు, మట్టరాజు,ఆయా గ్రామాల సర్పంచ్‌లు, ఎంపీటీసీలు, నాయకులు పాల్గన్నారు.

ఇల్లంతకుంటలో..

ఇల్లంతకుంట : అక్టోబర్ 24 : మండల కేంద్రం తోపాటు అన్ని గ్రామాలలో దసర ఉత్సవాలను సోమవారం కొన్ని గ్రామాలు, మంగళవారం మరి కొన్ని గ్రామాలు ఘనంగా జరిగాయి. దసర వేడుకలలో బాగంగా పోశమ్మ దేవాలం, బండి వృక్షం దగ్గర ప్రత్యేక పూజలు చేసి ఉత్సవాలు జరుపుకున్నారు. దసర ఉత్సవాలలో ఎక్కడా అల్లర్లు కాకుండా స్ఐ సుధాకర్ గట్టి బందోబస్తు ఏర్పాటు చేశారు. ఈ కార్యక్రమంలో అన్ని గ్రామాలలో సర్పంచులు, ఎంపీటీసీలు, ప్రజలు పాల్గొన్నారు.

గంభీరావుపేట: సీతారామస్వామి రథాన్ని లాగుతున్న భక్తులు

గంభీరావుపేటలో..

గంభీరావుపేట, అక్టోబర్ 24: మండల కేంద్రంతో పాటు ఆయా గ్రామాల్లో దసరా ఉత్సవాలను ఘనంగా నిర్వహించుకున్నారు. శమీ వృక్షానికి వేదపండితులు ప్రత్యేక పూజలు చేసిన అనంతరం దసరా పండుగ శుభాకాంక్షలు తెలుపుకుంటు ఒకరినొకరు అలింగనం చేసుకున్నారు.

తంగళ్లపల్లిలో ..

సిరిసిల్ల రూరల్, అక్టోబర్ 24: తంగళ్లపల్లి మండల కేంద్రంలో దసరా ఉత్సవాలు మంగళవారం రాత్రి ఘనంగా జరిగాయి. నర్సింహస్వామి గుట్ట ప్రాంతంలో ఫ్రెండ్స్ క్లబ్ ఆధ్వర్యంలో మహిశాసురమర్థిని దహనం చేశారు. ఎంపీపీ పడిగెల మానస, సిరిసిల్ల రూరల్ సీఐ సదన్‌కుమార్, ఎస్ఐ వెంకటేశర్లు, బీఆర్ఎస్ మండలాధ్యక్షుడు గజబీంకార్ రాజన్న, ఫ్రెండ్స్ క్లబ్ అధ్యక్షుడు మోర లక్ష్మీరాజం, సర్పంచ్ అంకారపు అనిత, ఎంపీటీసీ కోడి అంతయ్య, బీఆర్ఎస్ మండలాధ్యక్షుడు అంకారపు రవీందర్, పడిగెల రాజు, ప్యాక్స్ వైస్‌చైర్మన్ ఎగుమామిడి వెంకటరమణారెడ్డి, పెద్దూరి తిరుపతి, వైద్య శివప్రసాద్, లింగాల భూపతి, మోర రాజు, కోడం రమేశ్, భానుమూర్తి, ఎండీ హమీద్ ఉన్నారు. బతుకమ్మ ఉత్సవాల్లో భాగంగా బెస్ట్ బతుకమ్మకు భారతి ఫర్నిచర్ ఆధ్వర్యంలో డ్రెస్సింగ్ టేబుల్‌తోపాటు బహుమతులను అందజేశారు.

దాడి ఘటనలో నలుగురిపై కేసు

వీర్నపల్లి, అక్టోబర్ 24: మద్యం మత్తులో ఓ యువకుడిపై దాడి చేసిన నలుగురిపై కేసు నమోదు చేసినట్లు ఎస్ఐ నవత తెలిపారు. ఆమె అందించిన వివరాల ప్రకారం.. వీర్నపల్లిలో ఆకుల మహేందర్ ఇంటికి రంగంపేటకు చెందిన గుండి బాబు మద్యం కోసం వెళ్లారు. ఇరువురి మధ్య మాట మాటా పెరిగి ఘర్షణకు దారితీసింది. మా తండ్రిపై దాడి చేస్తావా అంటూ మద్యం మత్తులో ఉన్న ఆకుల వేణు, అతడి మిత్రులు వీర్నపల్లికి చెందిన దేశరాజు రఘుచందు, తాళ్ల మణిదీప్ సోమవారం రాత్రి బాబు ఇంటికి వెళ్లారు. అతడి కుటుంబ సభ్యులను బూతులు తిడుతూ దాడి చేయగా, బాబుకు తీవ్రగాయాలయ్యాయి. స్థానికులు అంబులెన్స్‌లో బాబును దవాఖానకు తరలించారు. బాధితుడి ఫిర్యాదు మేరకు నలుగురిపై కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్ఐ వివరించారు.

పండుగ పూట విషాదం

ముస్తాబాద్, అక్టోబర్ 24: దసరా పండుగపూట ఓ ఇంట్లో విషాదం నెలకొంది. మండలంలోని పోతుగల్‌కు చెందిన కేసుగాని బాబు (45) కుటుంబ సభ్యులతో కలసి భోజనం చేస్తుండగా ఒక్కసారి కుప్పకూలి పడిపోయాడు. కుటుంబ సభ్యులు దవాఖానకు తరలించే తరలిస్తుండగా మార్గమధ్యలో మృతి చెందాడు. మృతుడికి భార్య సంతోషి, కుమారుడు రుద్ర (8) ఉన్నారు. పండుగపూట ఇంట్లో విషాదాన్ని నింపడంతో గ్రామస్తులు, బంధువుల విచారం వ్యక్తం చేశారు.

కనుల పండువగా శోభాయాత్ర

సుద్దాలలో స్వామివారి శోభాయాత్ర నిర్వహిస్తున్న అర్చకులు, భక్తులు

కోనరావుపేట, అక్టోబర్ 24: సుద్దాల గ్రామంలో చెన్నకేశ్వర స్వామి శోభాయాత్రను కనుల పండువగా నిర్వహించారు. ప్రత్యేకంగా అలంకరించిన వాహనంలో స్వామివారిని వీధుల్లో భక్తుల భజన సంకీర్తనల మధ్య ఊరేగించారు. ఇక్కడ సర్పంచ్ ఉప్పుల దేవలక్ష్మి, ఎంపీటీసీ కాశవేణి మమత, సింగిల్ విండో వైస్ చైర్మన్ కాశవేణి మహేశ్‌యాదవ్, అర్చకుడు మిత్రదాసరి లక్ష్మయ్య, నేతలు ఉప్పుల శంకర్, కాశవేణి మహేశ్‌యాదవ్, కచ్చకాయల మహేశ్, భక్తులు పాల్గొన్నారు.

మెట్‌పల్లి రెవెన్యూ డివిజన్ ఆవిర్భావ వేడుకలు

మారుతీనగర్, అక్టోబర్ 24: మెట్‌పల్లి ప్రజల సమైక్య పోరాట ఫలితమే రెవెన్యూ డివిజన్ ఆవిర్భావం సాధ్యమైందని సాధన కమిటీ అధ్యక్షుడు తోకల సత్యనారాయణ అన్నారు. సోమవారం స్థానిక అంబేద్కర్ పార్కులో మెట్‌పల్లి రెవెన్యూ డివిజన్ ఆవిర్భావమై 8వ సంవత్సరంలోకి అడుగిడుతున్న సందర్భంగా అంబేద్కర్ విగ్రహానికి పూలమాలలు వేసి స్వీట్లు పంచిపెట్టి వేడుకలను ఘనంగా జరుపుకొన్నారు.

ముగిసిన దేవీ నవరాత్రి ఉత్సవాలు

సిరిసిల్ల రూరల్: దుర్గా మాత కు పూజలు చేస్తున్న నేతలు

సిరిసిల్ల రూరల్, అక్టోబర్ 24: దేవి నవరాత్రి ఉత్సవాలు మంగళవారంతో ముగిశాయి.తంగళ్లపల్లి మండల కేంద్రంతోపాటు పలు గ్రామాల్లో దుర్గా మాత మండపాల్లోని అమ్మవారిని సాయంత్రం వేళలో ఊరెగింపుగా తీసుకేళ్లి,నిమజ్జనం చేశారు.అంతకుముందు దుర్గామాతకు ప్రత్యేక పూజలు చేశారు.కార్యక్రమాల్లో బీఆర్ఎస్ మండలాధ్యక్షుడు గజబీంకార్ రాజన్న,రాపెల్లి ఆనందం, మచ్చఅంజనేయులు,సామల రమేష్ ,మోర శ్రీహరి,మచ్చ శ్రీనివాస్ ,బండిజగన్, అంకారపు మహేష్,అరవింద్,లింగం,అశోక్ , రామకృష్ణ, తదితరులు ఉన్నారు.

అమ్మవారి చీరలకు రూ.1,06,400

తంగళ్లపల్లి మండల కేంద్రంలో శ్రీ పరమేశ్వరీదేవి ఉత్సవ కమిటీ ఆద్వర్యంలో ఏర్పాటు చేసిన దుర్గామాతా మండపంలో 9 రోజుల పాటు పూజలందుకున్న 9 చీరలు, కలశాలను మంగళవారం వేలం వేశారు. వేలంలో మండల కుర్మ సంఘ అధ్యక్షుడు ఎగుర్ల కనకరాజు రూ.1,06,400కు దక్కించుకున్నారు. ఈసందర్భంగా కనకరాజుకు అమ్మవారి ప్రసాదాలు అందించి,శాలువాతో నిర్వాహకులు ఘనంగా సన్మానించారు.

గోపాలరావుపల్లెలో లడ్డూకు రూ.36వేలు

తంగళ్లపల్లి మండలం గోపాలరావుపల్లెలో దుర్గామాత మండపంలో మంగళవారం లడ్డూ వేలం నిర్వహించారు. 9 రోజులపాటు పూజలందుకున్న లడ్డూను వేలంలో మాజీ సర్పంచ్, రెడ్డి సంఘం మండలాధ్యక్షుడు ఏసీరెడ్డి రాంరెడ్డి దక్కించుకున్నారు. ఈసందర్భంగా నిర్వాహకులు రాంరెడ్డి దంపతులకు తీర్థ ప్రసాదాలు అందించి, సన్మానించారు.

ఘనంగా దుర్గామాత నిమజ్జనోత్సవం

ఇల్లంతకుంట : అక్టోబర్ 24 : మండల కేంద్రం తోపాటు అన్ని గ్రామాల్లో మంగళవారం దుర్గామాత నిమజ్జనోత్సవాలు ఘనంగా జరిగాయి. అమ్మవారు 9 రోజుల పాటు రోజుకో రూపంలో భక్తులకు దర్శనమిచ్చారు. జంగంరెడ్డిపల్లిలో ఎమ్మెల్యే రసమయి బాలకిషన్, జడ్పీ వైస్ చైర్మన్ సిద్ధం వేణు, మండల కేంద్రంలో ఎంపీపీ ఊట్కూరి వెంకటరమణారెడ్డి, గాలిపెల్లిలో మాజీ ఏఎంసీ చైర్మన్ చింతపల్లి వేణురావు అమ్మవారిని దర్శించుకుని పూజలు చేశారు. అమ్మవారిని భక్తి పాటలతో మహిళలు కోలాటం ఆడుతూ నిమజ్జనోత్సవానికి తరలించారు.

ఇల్లంతకుంట: జంగంరెడ్డి పల్లిలో దుర్గా మాతను దర్శించుకున్న ఎమ్మెల్యే రసమయి

కోనరావుపేట: కొలనూర్‌లో దుర్గామాతను నిమజ్జనానికి తరలిస్తున్న గ్రామస్తులు

వైభవంగా దుర్గాదేవి శోభాయాత్ర

కోనరావుపేట, అక్టోబర్ 24: మండలంలోని కొలనూర్, నిజామాబాద్, కోనరావుపేటలో దుర్గాదేవి నిమజ్జన శోభాయాత్రను వైభవంగా నిర్వహించారు. మహిళల కోలాటాలు, యువకుల నృత్యాలు, భక్తుల భజన సంకీర్తనలతో సమీపంలో చెరువులు, కుంటల్లో అమ్మవారిని నిమజ్జనం చేశారు.